క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే జేబీఆర్ మండలానికి రాక

దుర్గి: ఖరీఫ్‌కు కందిపంటను సాగు చేస్తున్న దృష్ట్యా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేయనున్న నేపథ్యంలో నేడు దుర్గి మండలానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విచ్చేయనున్నట్లు ఏవో వై.అమీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అధికంగా కందిపంటను సాగు చేస్తున్నారని రైతులకు రాయితీ మీద విత్తనాలు పంపిణీ చేయటం కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా రైతులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలలో కంది పంట వేస్తున్న రైతులు తప్పనిసరిగా హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తుమృకోటలో మోటార్ చోరీ

రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామంలో రైతు ఏర్పాటు చేసుకున్న బోరు గుంతను పూడ్చి, మోటార్‌ను చోరీ చేసి ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పోట్ల శ్రీనివాసరావు పుల్లయ్యకుంట సమీపంలో పంట పొలాలకు 6 నెలల కిందట ఏర్పాటు చేసుకున్న బోరు గుంతను పూడ్చి అక్కడ ఉన్న 10 హెచ్‌పీ మోటార్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సుమారు 300 అడుగుల లోతులో వేసుకున్న బోరు గుంతను పూడ్చి ధ్వంసం చేయడంతో పాటు ఇటీవల కొనుగోలు చేసిన 10 హెచ్‌పీ మోటార్ చోరీకి గురికావడంతో రూ.4 లక్షల వరకు నష్టపోయినట్లు శ్రీనివాసరావు తెలిపారు. రెంటచింతల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

బోదిలవీడు ఇన్‌చార్జి సర్పంచ్‌గా ధర్మవరపు

వెల్దుర్తి: మండలంలోని బోదిలవీడు గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బుధవారం ధర్మవరపు శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గత పంచాయతీ ఎన్నికల సందర్భంగా కుదిరిన పెద్ద మనుషుల ఒప్పందం మేరకు ఇప్పటి వరకు సర్పంచ్ బాధ్యతలు నిర్వహించిన పంగులూరి కృష్ణకుమారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటంతో ధర్మవరపు శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావుతో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును పలువురు సత్కరించి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని జీవీ మాల్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం పట్టణానికి చెందిన చదలవాడ నాగేశ్వరరావు (35)తో పాటు మరో ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పట్టణంలోని జీవీ మాల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గేదెలు అడ్డువచ్చాయి. బైక్ అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న లారీ కింద పడిపోయింది. ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా, నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా, చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా సాయి మందిరం ప్రతిష్ట మహోత్సవం



విజయపురిసౌత్: స్థానిక శ్రీ సత్యసాయి ప్రేమ మందిరం 29వ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమంతరావు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 5:15 గంటలకు స్వామి వారికి కాకడ హారతి, 6 గంటలకు షిరిడీ సాయిబాబాకు మంగళ స్నానం నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారికి పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ



సత్తెనపల్లి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని వృంద మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యనభ్యసిస్తున్న కేతావత్ సౌమ్యశ్రీ భాయ్ 470 మార్కులు సాధించింది. ఇంగ్లిష్‌లో 90, సంస్కృతం 98, ఎకనామిక్స్ 89, కామర్స్ 99, సివిక్స్ 94 మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ గంగారపు అనూష తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

బడి ఈడు పిల్లలందరినీ

బడిలో చేర్చడమే లక్ష్యం



కంభంపాడు గ్రామంలో నేను బడికి పోతా ర్యాలీలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

మాచర్ల రూరల్: అందరికీ విద్య కల్పించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్చేందుకు 'నేను బడికి పోతా' అనే సరికొత్త కార్యక్రమానికి రాష్ట్ర విద్యా శాఖ శ్రీకారం చుట్టింది. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలందరినీ బడిలో చేర్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యా శాఖ సమగ్ర శిక్షణాధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పర్యవేక్షణ జరుపుతున్నారు.

జూలై 12 వరకు స్పెషల్ డ్రైవ్

డ్రాప్ అవుట్స్‌ను తగ్గించేందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న సమగ్ర శిక్షణ ద్వారా నేను బడికి పోతా కార్యక్రమాన్ని జూలై 12 వరకు ప్రత్యేకంగా నిర్వహించేందుకు విద్యా శాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలతో కలిసి బడి ఈడు పిల్లలను బడిలో చేర్చేందుకు విస్తృతంగా గ్రామాలలో పర్యటిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో ఇంటింటికీ తిరుగుతూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. చదువుకు దూరంగా ఉన్న వారికి చదువుకోవటం వలన కలిగే ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాలు వివరిస్తూ విద్యాభివృద్ధి కోసం చిన్నారులకు అందిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు పాఠశాలలో డిజిటల్ విద్య, సాంకేతిక విద్య గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. జూలై 13 కల్లా అర్హత కలిగిన పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలనే లక్ష్యంతో గ్రామ, మండల, పేరెంట్స్ కమిటీలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలన్నా, సమాజంలో వెనుకబాటు తనం పోవాలన్నా, మంచి గుర్తింపు పొందాలంటే ఒక్క విద్యతోనే సాధ్యపడుతుందని, అన్ని అర్హతలతో కూడిన ఉపాధ్యాయులు అత్యున్నత బోధనతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ బడుల్లో చేరి తమ చిన్నారుల భవిష్యత్తుకు మంచి ప్రణాళిక రూపొందించాలని తల్లిదండ్రులను అభ్యర్థిస్తూ ఉపాధ్యాయులు చేస్తున్న విస్తృత ప్రచారం పలువురిని ఆకట్టుకుంటోంది.



జమ్మలమడకలో నేను బడికి పోతా కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు



ఆజాద్ నగర్‌లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల సంఖ్యను పెంచేలా సమష్టి కృషి



నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. బడి నుంచి బయటకు ఎంత మంది వెళ్తున్నారో అంతకు మించి బడిలో కొత్త విద్యార్థులను చేర్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్నాం. పేరెంట్స్ కమిటీ చైర్మన్, గ్రామ కమిటీ, సీఆర్‌పీలు, సీడీపీవో, హెచ్‌ఎంలతో కలిసి క్లస్టర్‌గా ఏర్పాటు చేశాం. వీరందరూ బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి బడిలో చేర్చేలా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు మండలంలో 100కు పైగా విద్యార్థులు చేరారు.

అల్లి సురేష్, ఎంఈవో

కృష్ణవేణి కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, సిబ్బంది

మాచర్ల: ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వై.వెంకట్రామయ్య బుధవారం తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో షేక్ షాహినా 462 మార్కులు, షేక్ షమీర్ 461, బైపీసీలో థెరిస్సా 424, వై.సౌమ్య 420 మార్కులు, సీఈసీలో షేక్ మొహతాజ్ 454, షేక్ మీరా 451 మార్కులు, ఇతర గ్రూపుల్లో 450 మార్కులు 15 మంది విద్యార్థులు సాధించినట్లు వెల్లడించారు. ఫలితాలు విడుదల అనంతరం బుధవారం సాయంత్రం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, అభినందించారు.

విద్యార్థులకు ప్రకృతి పాఠాలు



విద్యార్థులకు ప్రకృతి పాఠం బోధిస్తున్న పర్యావరణవేత్త అంకారావు

కారెంపూడి: సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పాఠాలు బోధిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మండలంలోని పేటసన్నెగండ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ ఆవశ్యకతను బోధించారు. పర్యావరణం కలుషితమైపోతోందని ఇదే పరిస్థితి కొనసాగితే భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని జాజి వివరించారు. ప్రస్తుతం పర్యావరణాన్ని పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లో తీర్చిదిద్దబడినట్లుగానే పర్యావరణ పరిరక్షణ కూడా తరగతి గదుల నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు సీడ్ బాల్స్ తయారీ గురించి వివరించి, వారిచే వాటిని తయారు చేయించారు. వర్షాలు పడినప్పుడు సీడ్ బాల్స్‌ను అటవీ మైదాన ప్రాంతాలలో చల్లడం ద్వారా మొక్కలకు ప్రాణం పోయాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దానిని సంరక్షణ చేస్తే పర్యావరణ సమతుల్యం లోపించి జరుగుతున్న అనర్థాలను దూరం చేయవచ్చన్నారు. అడవుల ప్రాముఖ్యత వాటి ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అడవులు అంతరించిపోతున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయని వాటి విస్తీర్ణం భూభాగంలో నికరంగా 33.5 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉంటే జాజి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి అక్కడి ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ప్రకృతి పాఠాలు బోధిస్తున్నారు. చైతన్యవంతమైన ప్రయోజనకరమైన ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు విద్యార్థులు చేయూతనందిస్తూ సీడ్ బాల్స్ తయారు చేసి వాటిని జాజికి అందిస్తున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



పిడుగురాళ్ల: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ సీఐ ఆంజనేయులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యాంటీ డ్రగ్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. అనంతరం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ లాంటి దురలవాట్లకు గురికావద్దని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సెబ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రబ్బానిఖాన్, సెబ్ ఎస్‌ఐ ప్రతాప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సుందరంగా ఆలయం నిర్మించి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షిక వేడుకలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గిరీశం ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామి వార్ల ఉత్సవ మూర్తులను, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి కుటుంబ సమేతంగా విశేష పూజల్లో పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (కౌలు రైతు కార్డు) అందించేందుకు సత్తెనపల్లి మండలం కంటిపూడి, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు షేక్ ఘన్‌సైదా, జి.కిరణ్‌కుమార్, షేక్ జాన్‌రస్కిన్, వీహెచ్‌ఏలు ఎస్.మనోజ్ కుమార్, ఒ.శివశంకర్, ఎం.చంద్రశేఖర్‌లు హాజరై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తులు అందించాలని కోరారు. ఆయా సభల్లో కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రాము



సత్తెనపల్లి: ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన గొల్లపల్లి రాము నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నుంచి బుధవారం ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. గొల్లపల్లి రాము ఈ నెల 23 నుంచి 2026 డిసెంబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి రాము మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి, తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సద్వినియోగం చేసుకోవాలి



నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో విద్యార్థులు

నకరికల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఫాహిం విద్యార్థులకు సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశామని అన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, వయస్సుకు తగిన తరగతుల్లో చేర్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పఠాన్ మల్లిక, చెరుకూరు వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, గేరా మోహన్‌రావు, ఏసీహెచ్ వెంకట్రావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల వలన భూ యజమానులకు నష్టం ఉండదు

రాజుపాలెం: కౌలు రైతులకు భూహక్కు పత్రాలు ఇవ్వడం వలన భూయజమానుల హక్కులకు భంగం వాటిల్లదని తహసీల్దారు లక్ష్మీనరసింహ తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలోని గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం బుధవారం జరిగింది. తహసీల్దారు మాట్లాడుతూ కౌలు రైతు తప్పనిసరిగా సాగు పత్రాలు పొంది బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు పొందాలని తెలిపారు. కౌలు రైతులకు 11 నెలల కాలపరిమితితో సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడం జరుగుతుందని, ఈ కార్డుల వలన పంట నమోదు చేయించుకోవచ్చని, ప్రకృతి విపత్తుల వలన నష్టం జరిగితే నష్టపరిహారం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో తులసి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సైదుబాబు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సమర్థంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో జూలై 1 నుంచి నిర్వహించనున్న చట్టబద్ధమైన గ్రామ సభలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామ సభలకు క్షేత్రస్థాయి అధికారులందరూ అందుబాటులో ఉండాలని గ్రామాభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలలో భాగస్వాములు కావాలన్నారు. ప్రస్తుతం గ్రామాలలో డయేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. గ్రామాలలో నివాస పరిసర ప్రాంతాలలో మురుగునీటి నిల్వలు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఏ గ్రామంలో కూడా తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 1 నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది మాత్రమే ఇంటింటికి వెళ్లి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేస్తారన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.3 వేలు, జూలై నెల పింఛన్ రూ.4 వేలతో కలిపి రూ.7 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.నరేంద్రారెడ్డి, కార్యదర్శులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ జాతర



తుమృకోట(రెంటచింతల): మండలంలోని తుమృకోట గ్రామంలో ఇంద్రపల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవ వేడుకలలో భాగంగా 4వ రోజు బుధవారం ఆలయ అర్చకులు సాయికృష్ణ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఇంద్రపల్లి అమ్మవారికి పూర్వం నుంచి ఒక ఆచారంగా రెండు సంవత్సరాలకు ఒకసారి గ్రామంలో ముత్యాలమ్మ జాతరను కులమతాలకు అతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. 9 రోజుల పాటు నిర్వహించే ఈ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

కంభంపాడు గ్రామంలో పారిశుధ్య పనులు



నీళ్ల ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా గ్రామాలలో పారిశుధ్య కార్మికులు నీటి ట్యాంక్‌లను శుభ్రం చేసే ప్రక్రియ బుధవారం చేపట్టారు. ఎంపీడీవో సరోజినీదేవి ఆదేశాల మేరకు మండలంలోని కంభంపాడు గ్రామంలో వాటర్ ట్యాంక్‌లు, వీధుల్లోని కాల్వల్లోని పూడికతీత పనులు చేపట్టారు. ఇటీవల మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు, విస్తృతంగా వ్యాపించటంతో వాటి నివారణకు నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరిన్, బ్లీచింగ్ వంటి వాటితో శుభ్రపరచి ఫిల్టర్ చేసి మంచినీటిని వినియోగించేలా చర్యలు చేపట్టినట్లు ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో డయేరియా కేసులు ఎటువంటివి లేకుండా పలు రక్షణ చర్యలు తీసుకున్నట్లు వారు చెప్పారు.

మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పెదకూరపాడులో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

క్రోసూరు: మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పెదకూరపాడు డివిజన్ సీఐ ఎం.మంగారావు, ఎస్‌ఐ ఎం.షఫీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రోసూరులోని జై భారత్ స్కూల్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని కోరారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ చట్టం మాదకద్రవ్యాల నేరాలను చాలా తీవ్రంగా చూస్తుందన్నారు. అదేవిధంగా మదకద్రవ్యాలు కలిగి ఉన్నా, సరఫరా చేస్తున్నా, విక్రయిస్తున్నా జరిమానాలు కఠినంగా ఉంటాయన్నారు. మాదకద్రవ్యాల నేరాలలో శిక్ష, జరిమానా కూడా కఠినంగా ఉంటాయని తెలిపారు. ఒకప్పుడు మద్యానికి బానిసయ్యేవారు, ప్రస్తుతం మీసాలు రాని యువత కూడా వివిధ మత్తు పదార్థాలకు అలవాటు పడుతుండటం ఆందోళనకరమని అన్నారు. దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే చోటే ఈ డ్రగ్స్ మాఫియా వల వేస్తుంది. తెలిసో తెలియకో ఆ విష కౌగిలిలోకి యువత వెళ్లిపోతున్నారని, ఒక్కసారి దానికి బానిస అయిన తరువాత వెనక్కి రావడం అనేది జరగడం లేదన్నారు. సిగరెట్ల రూపంలో కూడా మత్తు పదార్థాలు అందజేస్తున్నారని, విద్యార్థులు ఈ మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఫలితంగా శక్తివంతమైన యువత ఈ మత్తు ప్రపంచంలో ఊగుతుంది. ఈ కార్యక్రమంలో జై భారత్ స్కూల్ డైరెక్టర్ తిప్పిరెడ్డి జైనేంద్ర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు షేక్ ఖదీర్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు తిరుపతి స్వామి, జై భారత్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సత్తెనపల్లి: మాదకద్రవ్యాల వినియోగంతో శారీరక, మానసిక పటిష్టతను కోల్పోవటమే కాక ఆ వ్యక్తి ఆర్థిక స్థితి పతనం అవుతుందని ప్యానల్ అడ్వకేట్, న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు సత్తెనపల్లి పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేకతపై బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. పారా లీగల్ వలంటీర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాల్సిన వయసులో చాలా మంది మత్తుకు బానిస అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి సహకరించాలని కోరారు. మరో లీగల్ వలంటీర్ షేక్ సుభాని కూడా దీనిపై చైతన్యం కలిగించారు. సదస్సులో న్యాయవాదులు బీబీఎల్ కోటేశ్వరరావు పలు చట్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం పోరాడదాం

పెదకూరపాడు: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పోరాడాలని పెదకూరపాడు ఎస్‌ఐ విపర్ల వెంకట్రావు అన్నారు. పెదకూరపాడులో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎస్‌ఐ వెంకట్రావు మాట్లాడుతూ నేటి యువత మత్తుకు అలవాటు పడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. డ్రగ్స్, గుట్కా, ఖైనీ లాంటి వ్యసనాలకు బానిస కాకుండా యువతను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. పూర్తిగా డ్రగ్స్‌ను కంట్రోల్ చేసేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు.

ముగిసిన కౌలు రైతుల గ్రామ సభలు



రుద్రవరం(ముప్పాళ్ల): మండలంలోని రుద్రవరం, తొండపి గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు కార్డుల ఎంపికపై బుధవారం గ్రామ సభలు జరిగాయి. ఆయా గ్రామ సభల్లో తహసీల్దార్ పి.సింగారావు, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణలు పాల్గొని కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. పొలం కౌలుకు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డు వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రైతు భరోసా సాయం అందుతుందన్నారు. కౌలు రైతు కార్డు ద్వారా ఐదుగురు కలిసి గ్రూపుగా ఏర్పడి బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీలా ఆంజనేయులు, వీఆర్వో మస్తాన్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.